క్లుప్తంగా

మట్టి రవాణాతో వివాదం

కోరుకొండ: మండలంలోని నర్సాపురంలో రామస్వామి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న భారీ వాహనాల కారణంగా ఆదివారం వివాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చెరువు నుంచి మట్టిని రవాణా చేస్తున్న వాహనాన్ని స్థానిక యువకులు ఆపారు. రోడ్డుపైన జనం గుమిగూడి, ట్రాఫిక్‌కు ఆటంకమవడంతో అటుగా వెళ్తున్న కారు యజమాని కారు ఆపి, వివరాలు అడగటంతో సమస్య తలెత్తింది. కారు యజమానితో స్థానికులకు వాగ్వివాదం జరగడంతో కారు అద్దాలు పగలగొట్టారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని, వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కారాదని ఇరువర్గాలను హెచ్చరించి పంపినట్టు ఎస్‌ఐ కూన రవికుమార్ తెలిపారు.

మోటారు రాగి వైర్లు చోరీ



సీతానగరం లంక భూముల్లో రాగి వైరు చోరీ అయిన మోటారు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం, రఘుదేవపురం లంకభూముల్లోని విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైర్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. శుక్రవారం సీతానగరానికి చెందిన రైతులు మట్ట శ్రీను, ఈలి శ్రీధర్, ఉప్పులూరి రమణ, చిటికిరెడ్డి కాపు, చిటికిరెడ్డి పోశయ్య, మట్ట మణి, మట్ట పోశయ్య, సంగిశెట్టి కోటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ శనివారం రాత్రి రైతులకు చెందిన సుమారు 30 మోటార్లకు చెందిన రాగి వైరును కట్ చేసి దొంగిలించారని చెప్పారు. మోటారు స్టార్టర్ నుంచి మోటారు వరకు రాగి వైరు సుమారు 15 మీటర్లు ఉంటుందని, ఆ వైరును కత్తిరించి తీసుకుపోయారన్నారు. మోటారు నుంచి స్టార్టర్ వరకు వైరు రూ.8 వేల నుంచి రూ.10 వేలు వరకు ఖరీదు ఉంటుందన్నారు. అయితే రాత్రి సమయంలో కొంతమంది యువకులు లంకభూముల్లో మద్యం సేవించి తిరుగుతున్నారని, వారే దీనికి పాల్పడి ఉండవచ్చని అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

ఆలయాలే లక్ష్యంగా దొంగల స్వైర విహారం



కుతుకులూరు సాయిబాబా ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం, ఎస్సై శ్రీను నాయక్

అనపర్తి : ఆలయాలే లక్ష్యంగా అనపర్తి మండలంలో దొంగలు స్వైర విహారం చేశారు. శనివారం అర్ధరాత్రి కుతుకులూరు, పెడపర్తి గ్రామాలలో పలు ఆలయాలలో హుండీలను పగులగొట్టి దొంగలు నగదు దోచుకుపోయారు. అనపర్తి ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం రెండు ఆలయాల్లో హుండీలను ఎత్తుకు వెళ్లగా మరో రెండు హుండీలను పగులగొట్టి నగదు దొచుకుపోయారు. కుతుకులూరులో ఆంజనేయ స్వామి గుడి, సాయిబాబా వారి ఆలయం, దేవి అమ్మవారి ఆలయం, పెడపర్తిలోని గంగానమ్మ ఆలయంలోను ఈ చోరీలు జరిగినట్టు ఆయన తెలిపారు. నగదు స్వల్ప మొత్తంలోనే ఉంటుందని ఆయన తెలిపారు. క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరిస్తున్నారని సీసీ కెమెరాలను కూడా పరిశీలించి దుండగులను పట్టుకుంటామని ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

ఘనంగా శ్రీ పుష్పయాగం



పుట్టకొండలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి శ్రీ పుష్పయాగం ఘనంగా జరిగింది. ఈ ఆలయంలో సీతారామచంద్రస్వామి వారి ప్రథమ సప్తాహాల్లో భాగంగా ఈనెల 5న భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆ కల్యాణంలో భాగంగా శ్రీ పుష్పయగం నిర్వహించారు. ఆలయ అర్చకుడు కమలాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లు వెంకటరమణ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కంబాలచెరువు: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ సీఐ పి.శివగణేష్ ఆధ్వర్యంలో హరిత న్యూరో హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కార్తీక్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సమాజంలో ఏ విధంగా ప్రవర్తించాలో వివరించారు. రౌడీషీటర్లు తమకు ఉన్న సమస్యలను డాక్టర్‌కు వివరించారు. సీఐ శివగణేష్ మాట్లాడుతూ చెడు అలవాట్లను దూరం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా జీవించాలన్నారు.

చట్టాలు వీరికి చుట్టాలు



తూర్పుగానుగూడెం ఊర చెరువులో మట్టిని యంత్రాలతో తవ్వుతున్న దృశ్యం



సీతానగరం ర్యాంపులో ఇసుకను యంత్రాలతో వాహనాల్లోకి లోడు చేస్తున్న దృశ్యం

- అడ్డు అదుపూ లేని ఇసుక, మట్టి తవ్వకాలు
- స్పందించని అధికారులు

రాజానగరం: చట్టాలు వీరికి చుట్టాలు. ఎవరికి కావలసిన మేరకు వారు గోదావరిలో ఇసుకను, చెరువులలో మట్టి, కాలువ గట్లను, కొండలను యంత్రాలను ఉపయోగించి మరీ తవ్వేసుకోవచ్చు. లారీలలో యథేచ్ఛగా రవాణా చేసుకుని జేబులు నింపుకోవచ్చు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది కాలంగా జరుగుతున్న తంతే ఇదే. అయినా అడ్డుకునే అధికారులు లేరు. అక్కడక్కడా ప్రతిపక్షానికి చెందిన వ్యక్తులు అడ్డుకునే ప్రయత్నం చేసినా, అక్రమార్కులకు అధికార పార్టీ పెద్దల సాయంతో ఉండటంతో ఎటువంటి ఫలితాన్ని ఇవ్వడం లేదు. దీనితో నియోజకవర్గంలో ఇసుక, మట్టి మాఫియా ఆడింది ఆట, పాడింది పాటగా సాగిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పుంత రోడ్లు, పక్కా రోడ్లు అనే భేదం చూపకుండా వందలాది లారీలలో అక్రమ రవాణా సాగిస్తూ దీపం (అధికారం) ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే పనిలో కూటమి నేతలు నిమగ్నమై ఉన్నారు.

కాసుల వర్షం కురిపిస్తున్న గోదావరి ఇసుక

సీతానగరం మండలంలోని గోదావరి ఇసుక, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని ఎర్రమట్టి అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది లారీలలో ఇసుక, మట్టి రవాణా అవుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో రోడ్లు పాడైపోయి, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా అక్రమార్కులకు ప్రజల సమస్యలు పట్టడం లేదు. అక్రమ సంపాదనే ముఖ్యంగా దోపీడీని కొనసాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు గోదావరిలో ఇసుకను నిర్మాణ పనుల కోసం ఉచితంగా అందించవలసి ఉంది. ఇందుకుగాను లబ్ధిదారులు ఆయా పంచాయతీల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను తీసుకువస్తే ర్యాంప్‌లలో ట్రాక్టరులో ఇసుకను లోడు చేస్తారు. సీతానగరం మండలంలో అధికార మద్దతు ఉన్న పెద్దలు సొంతంగా ర్యాంప్‌లను ఏర్పాటు చేసుకుని మరీ గోదావరిలో ఇసుకను తోడేస్తున్నారు. ముగ్గళ్ల, రఘుదేవపురం, బొబ్బిల్లంక, సీతానగరం, సింగవరం, వంగలపూడి, వెంకటనగరం, కాతేరు ప్రాంతాలలో ఇటువంటి ర్యాంప్‌లను చూడవచ్చు.



లారీలలో దూర ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

వీరికి నిబంధనలతో పనిలేదు

వేసవి తీవ్రత తగ్గి, వర్షాలు రానున్న ప్రస్తుత సమయంలో పర్యావరణం, అటవీ శాఖల నిబంధనల ప్రకారం నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి. కానీ సీతానగరం మండలంలో అటువంటి ఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు ఉండటంతో అక్రమార్కులు వాటిలో ఏదో ఒక పార్టీ జెండాను పట్టుకుని, తమ అజెండాను సాఫీగా అమలు చేసుకుపోతున్నారు. జెండా పట్టుకుని జై కొడితే చాలు వారు నిజానికి ఎవరనే విషయాన్ని కూడా చూడకుండా ఆయా పార్టీల పెద్దలు వీరి అక్రమార్జనకు అండగా నిలబడుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో గోదావరి ఇసుక, కొండలు, చెరువులలో మట్టి తవ్వకాలు, అమ్మకాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నాయి.

మాయమవుతున్న కొండలు, భయపెడుతున్న చెరువులు

మట్టి మాఫియా సాగిస్తున్న అక్రమ తవ్వకాలతో నియోజకవర్గంలో రాజానగరం, కోరుకొండ మండలాలలో ఉన్న కొండలు చాలా వరకు మాయమై పోయాయి. కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, కొత్తతుంగపాడు, కోటికేశవరం - నల్లగొండ, శ్రీరంగపట్నం - మునగాల, రాఘవాపురం, కాటవరం, పరిసరాలలో ఈ ఎర్రమట్టి కొండలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వీటి ఆనవాళ్లు క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితులు కానవస్తున్నాయి. చివరకు కనుపూరులోని దేవుని కొండను కూడా వదలలేదు. యంత్రాల సాయంతో కొండలను పిండి చేసి, సొమ్ము చేసుకున్న వ్యక్తులు ఎర్రమట్టితో కూడిన చెరువులపై దృష్టి పెట్టారు.

నర్సరీలకు ఎర్రమట్టి ఉపయోగపడుతున్న నేపథ్యంలో దీనికి మంచి డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను తమకు అనుకూలంగా వినియోగించుకుంటూ చెరువులలో ఎర్రమట్టిని తోడేసి, అక్రమ రవాణా చేస్తున్నారు. దీంతో చెరువుల గర్భం లోతై, రాబోయే రోజులలో ఎటువంటి ప్రమాదాలకు తావిస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మండలంలోని తూర్పుగానుగూడెంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఊరచెరువులో మట్టిని గత నాలుగు రోజులుగా యంత్రాల సాయంతో తవ్వి, దూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ప్రజాప్రయోజనాల పేరుతో సాగుతున్న ఈ దోపిడీపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అక్రమ తవ్వకాలు ఆగలేదు. నియోజకవర్గంలో మట్టి మాఫియా సాగిస్తున్న దందాకు ఇంతకంటే నిదర్శనం మరోటి లేదు.

–గంగిశెట్టి సోమేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, పాలచర్ల

విజన్ ప్లాన్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్

అనపర్తి : నియోజకవర్గ విజన్ ప్లాన్ స్వర్ణాంధ్ర 2047పై అనపర్తి నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో సమీక్షా సమావేశం అనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి రమేష్ మాట్లాడుతూ పాడి, వ్యవసాయం, పౌల్ట్రీ పరిశ్రమ, పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రాబోయే ఐదేళ్ల విజన్‌ను అమలు పరిచేందుకు ఎమ్మెల్యే చైర్మన్‌గా నాలుగు మండలాల్లో పనిచేసే సచివాలయ సిబ్బందిలో ఐదుగురు సభ్యులను యూనిట్‌గా అనపర్తిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు నియోజకవర్గ ప్రత్యేకాధికారి తెలిపారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట ఎంపీడీవోలు మండ రామకృష్ణారెడ్డి, వీరేశ్వరపు శ్రీనివాసరావు, సాయిబాబా, నాలుగు మండలాల ఎంఈవోలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పాల్గొన్నారు.

కోడిపందేలాడుతున్న ఐదుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం ఇటుక బట్టీల వద్ద కోడిపందేలాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. రఘుదేవపురం ఇటుక బట్టీల వద్ద దాడి చేసి కోడిపందేలాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,200, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

వేడుకగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పున ప్రతిష్ఠ



ఆలయ పున ప్రతిష్ఠ నిర్వహిస్తున్న పండితులు



స్వామిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

కోరుకొండలో ఆధ్యాత్మిక సందడి

కోరుకొండ: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ఆదివారం వేడుకగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ జరిగిన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామి వారి నూతన విగ్రహం, శిఖరం, ధ్వజమయూర, సర్పబంధ పున ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. పండితులు పాణింగపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు, ఆగమ పండితులు ఇంద్రగంటి విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

భారీ అన్న సమారాధన

స్వామివారి ఆలయ పునప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. కోరుకొండ, కాపవరం, జంభూపట్నం, శ్రీరంగపట్నం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

స్వామివారిని దర్శించుకున్న జక్కంపూడి రాజా

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరినీ కాచి కాపాడాలని కోరి ప్రార్థించారు. రైతులకు పంటలు బాగా పండేలా, వ్యవసాయాలు లాభదాయకంగా సాగేలా చూడాలని కోరుకున్నారు. ఆయన వెంట పార్టీ యువజన విభాగరం జిల్లా కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు, ఆలయానికి ధ్వజ స్తంభం దాత, పారిశ్రామిక వేత్త మాగంటి శ్రీనివాసరావు, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఆలయ చైర్మన్ ఉల్లి బుజ్జిబాబు, వైస్ చైర్మన్ బదిరెడ్డి దొర, సెక్రటరీ తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, సభ్యులు నీరుకొండ బాబ్జి, ఉల్లి కాశీ పాల్గొన్నారు.

మండల టీడీపీలో నిరసనలు



సీతానగరంలో నిరసన తెలుపుతున్న టీడీపీ గ్రామ కమిటీ ఇన్‌చార్జిలు

సీతానగరం: టీడీపీ గ్రామ కమిటీ నియామకాల తీరుకు నిరసనగా ఆ పార్టీలో పదవులకు రాజీనామాల పర్వం కొనసాగుతోంది. నిరసన తెలియజేస్తూ వినతిపత్రాల అందజేత కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం సీతానగరంలోని పలువురు బూత్ కమిటీ ఇన్‌చార్జిలు పార్టీ పోకడలను వ్యతిరేకిస్తూ వినతిపత్రాలను అందజేశారు. వంగలపూడికి చెందిన గద్దె వెంకట సురేష్ టీడీపీలో క్లస్టర్–1 ఇన్‌చార్జి పదవికి, మిర్తిపాడుకు చెందిన వాకలపూడి శివ రామకృష్ణ గ్రామ కమిటీ అధ్యక్ష, 56వ బూత్ ఇన్‌చార్జ్ పదవులకు రాజీనామా చేశారు. సీతానగరం బూత్ కమిటి ఇన్‌చార్జిలు కొడవటి వెంకట రామారావు, ముళ్ల సుబ్బారావు, పోలిపర్తి ఫణి నూక రాజు, జొన్నల వెంకటేశ్వరరావు, గుల్లి దుర్గాప్రసాద్, మట్ట సీతారామయ్యలు రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరికి వినతిపత్రం పంపించారు. విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, పార్టీ విజయానికి కృషి చేశామని, అటువంటిది ఎవరికి తెలియకుండా ఏకపక్ష నిర్ణయాలతో కమిటీ నియామకాలు జరపడం సబబు కాదని, ప్రజాస్వామ్య బద్ధంగా గ్రామ కమిటీ నియామకాలను పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏకపక్ష నిర్ణయాలతో ఏర్పాటు చేస్తే, గ్రామ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించి, తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని హెచ్చరించారు.

రైతుకు దారుణంగా వెన్నుపోటు

- అన్నదాత సుఖీభవ లేదు, బీమా అసలే లేదు
- అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి : కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మించి రైతులకు పొడిచిన వెన్నుపోటు మరీ దారుణమని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ అందలేదని, బీమా అసలే లేదని అన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఒక అడుగు ముందుకేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మధ్యవర్తిత్వం చేసి రైతుల నెత్తిన శఠగోపం పెట్టారని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల ఖాతాల్లో నేటికీ ప్రోత్సాహక నగదు జమ కాలేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని, కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరచి ముందుగా మూసివేయడంతో రైతులు తమ పంటను దళారులకు, మిల్లర్లకు అయినకాడికి తెగనమ్ముకుని నష్ట పోయారన్నారు. పెదపూడి మండలంలో సుమారు రూ.55 కోట్ల ధాన్యం సొమ్ము నేటికి చెల్లించక రైతులు అల్లాడిపోతున్నారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాటలైతే కోటలు దాటుతున్నాయి కాని రైతుల బాధలు మాత్రం తీరడం లేదని చెప్పారు. మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు ఎకరానికి సమారు రూ.10వేల వరకు నష్టం కలుగచేస్తున్నారని తాను క్షేత్ర పరిశీలనకు వెళ్లినప్పుడు రైతులే స్వయంగా తమ గోడు వెళ్లబోసుకున్నారన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేసే రైతులు మరింత తగ్గిపోతారని, ప్రభుత్వం రైతు సమస్యలపై తక్షణం స్పందించాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్య దేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు సూర్యదేవుని వార్షిక కల్యాణం

జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి వారి 123వ వార్షిక కల్యాణం సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నామని ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొవ్వూరి బాలకృష్ణారెడ్డి తెలిపారు. భారతదేశంలోనే వైష్ణవ సంప్రదాయ సూర్యదేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఇక్కడ కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు కొవ్వూరి బసివిరెడ్డి 177వ జయంతి ఉత్సవం కూడా ఈ సందర్భంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ప్రకటన

[illegible]

పి.సూర్యనారాయణమూర్తి
కొండ్రెడ్డి మతి శ్రీ గారి తరఫున లాయరు
రాజమండ్రి సెల్: 9885665808
8-6-2025 సెల్: 8886427666

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీనివాసరెడ్డి (ఫైల్)

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో గత నెల 31వ తేదీన కొదండ రామా రైస్‌మిల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న గుడిమెట్ల శ్రీనివాస రెడ్డి(46) శనివారం మృతి చెందినట్టు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత నెల 31 తేదీన పందలపాక గ్రామంలోని శ్రీ కోదండ రామా రైస్ మిల్ వద్ద జరిగిన ప్రమాదంలో వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఒక్కసారి బ్రేకు వేయడంతో వెనుక నుంచి బైకు ఢీ కొంది. బైక్‌పై ఉన్న పందలపాక చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిలో రెడ్డి పైడరావును అనపర్తి సీహెచ్‌సీకి తీసుకు వెళుతుండగా మార్గం మధ్యంలో మరణించారు. అయితే తీవ్ర గాయాలతో ఉన్న గుడిమెట్ల శ్రీనివాస్‌రెడ్డిని అనపర్తి సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం రాయవరంలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో అనపర్తి సీహెచ్‌సీ వద్ద పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

ఘనంగా శ్రీమెట్ట గంగాలమ్మ జాతర



రాపాక శ్రీమెట్ట గంగాలమ్మను దర్శించిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని రాపాక శ్రీ మెట్ట గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లకు ఒక్కసారి జరిగే శ్రీమెట్ట గంగాలమ్మ అమ్మవారి జాతరకు రాపాక, నల్గొండ, రఘుదేవపురం, కోరుకొండ మండలం కోటి, కోటి కేశవరం గ్రామ ప్రజలతో పాటు ఈ ప్రాంత రైతులు విశేషంగా వస్తారన్నారు. వీరందరూ అమ్మవారిని ఆరాధ్యదైవంగా కొలుస్తారన్నారు. రెండు రోజుల పాటు జరిగే జాతరలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పూజించి, మొక్కుబడులు సమర్పిస్తారన్నారు. ఈ ప్రాంత రైతులకు అధిక దిగుబడులు రావాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, గంగాధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు రాజమహేంద్రవరం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పలు విభాగాలలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, టూటౌన్ పోలీస్ అధికారులు, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్‌తో మాదక ద్రవ్యాలపై సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. సుమారు 50 మంది అధికారులు, సిబ్బంది రైల్వే స్టేషన్‌లోని పాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాళ్లు, పార్శిల్ కార్యాలయం, క్లాక్ రూమ్‌లలో తనిఖీలు నిర్వహించారు.

వృద్ధులకు అన్నదానం

ధవళేశ్వరం: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహన రావు సోదరుడు జక్కంపూడి చిన్ని ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు జక్కంపూడి చిన్ని తనయుడు దత్తు భోజనాలు పంపిణీ చేశారు.